సాక్షి అనకాపల్లి

బుధవారం : 3 : జనవరి : 2024



బాక్సింగ్‌లో కాంస్య పతకం

విశాఖ: అఖిల భారత అంతర్ వర్సిటీ బాక్సింగ్ పోటీల్లో తక్షశిల ఐఏఎస్ అకాడమీ విద్యార్థిని శైనీశ్రీ కాంస్య పతకం సాధించారు.



విరబూసిన ఆర్కిడ్

విశాఖ: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనంలో ఫాక్స్‌టైల్ ఆర్కిడ్ విరబూసింది. తెల్లని పుష్పాలతో మంగళవారం కనువిందు చేసింది.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 21.8 నుంచి 28.5 డిగ్రీలు, తేమ 80 నుంచి 83 శాతం, గాలి గంటకు 5 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

రేపు టిడ్కో గృహాల పంపిణీ

అనకాపల్లి : మండలంలోని సత్యనారాయణపురంలో నిరుపేదల టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం ఈనెల 4న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. 330 ఎస్ఎఫ్‌టీ 2296 మందికి, 365 ఎస్ఎఫ్‌టీ 96 మందికి, 430 ఎస్ఎఫ్‌టీ 352 మందికి పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారి విచ్చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావలసిందిగా ఆయన కోరారు.

కార్మికశాఖ సహాయ కమిషనర్‌గా వసంతరావు



అనకాపల్లి : స్థానిక కార్మికశాఖ కార్యాలయంలో జిల్లా సహాయ కమిషనర్‌గా కె.వసంతరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న కార్మిక సమస్యలు, సంక్షేమ పథకాలు కార్మికులకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ–శ్రమ్ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్మిక చట్టాలు అమలు అయ్యే విధంగా పని చేస్తానని చెప్పారు.

● 'పల్లె'వించిన ప్రగతి



ఒకప్పుడు అభివృద్ధిలో వెనుకబడిన గ్రామం.. ఇప్పుడు ప్రగతి పల్లవించిన పల్లెగా గుర్తింపు పొందింది.. గత స్థానిక ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ మద్దతు అభ్యర్థి సర్పంచ్‌గా గెలిచారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపకుండా నిధులు మంజూరు చేయడంతో గ్రామానికి మూడు వైపులా రూ.3.40 కోట్లతో తారురోడ్లు వచ్చాయి. ఇంటింటా కుళాయిలు, సీసీ డ్రైనేజీలు, మర్రి చెరువు అలుగు నిర్మాణంతో చీడికాడ మండలంలోని చెట్టుపల్లి పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది.

8లో



దేవరాపల్లి: బోయిలకింతాడ వైద్య శిబిరంలో అందుతున్న సేవలను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు



అనకాపల్లి: శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్



నర్సీపట్నం: పేషెంట్ కేస్ షీట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ఆరోగ్య సురక్ష.. రోగులకు శ్రీరామరక్ష

- రెండో దశ కార్యక్రమం ప్రారంభం
- తొలి రోజున 13 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

వ్యాధులు రాకుండా ముందుగానే పరీక్షలు చేసి, అవసరమైన వారికి వైద్యం అందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన ఈ కార్యక్రమం తొలి దశ విజయవంతమై రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమందికి వైద్యం అందిన విషయం తెలిసిందే. ఇప్పుడు రెండో దశలో మరిన్ని సేవలందించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. తొలిరోజున జిల్లాలో 13 చోట్ల వైద్య శిబిరాలను నిర్వహించినట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వి.జ్యోతి తెలిపారు. ప్రతి శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, ఒక నేత్ర వైద్యుడు పాల్గొని రోజులను పరీక్షించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

దేవరాపల్లి: పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. బోయిలకింతాడలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రోగులకు మందులు, కేస్ షీట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ల ద్వారా గ్రామాలలోనే వైద్య సేవలందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ల రాష్ట్ర కోఆర్డినేటర్ దేవి, జెడ్పీ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ బూరె బాబురావు, మండల ప్రత్యేకాధికారి వి.రవీంద్రనాథ్, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.హారిక తదితరులు పాల్గొన్నారు.

పేదవారికి పూర్తిస్థాయిలో వైద్యం

అనకాపల్లి: పేదవారికి పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయి నుంచి నిర్వహిస్తున్నట్లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో వెంకుపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్యం సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా ఏపీలో అభివృద్ధి, సంక్షేమం రెండు నేత్రాలుగా పాలన సాగుతోందన్నారు. ఏపీ ఈడబ్ల్యూ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.నర్సింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, గ్రామ సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, 11మంది స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారు.



నర్సీపట్నం: శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నిరంతర పర్యవేక్షణ

నర్సీపట్నం: జగనన్న ఆరోగ్య సురక్షలో గుర్తించిన వ్యాధిగ్రస్తులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వైద్యాధికారులకు సూచించారు. నర్సీపట్నం మండలం యరకన్నపాలెంలో బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఓపీ విభాగాలను పరిశీలించి, డాక్టర్లకు పలు సూచనలు చేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిలో ఇద్దరు ముందుకు రాలేదని కలెక్టర్ దృష్టికి నిర్వాహకులు తీసుకువెళ్లగా.. అలాంటి వారిని మోటివేట్ చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గుర్తించిన రోగులపై పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ జిల్లా వైద్యాధికారి హేమంత్‌కుమార్‌కు సూచించారు. ఎప్పటికప్పుడు సమీక్షించుకొని లోపాలను సరిచేయాలని, నిరంతరం మానిటరింగ్ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవో జయమాధవి, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ ప్రశాంతి పర్యవేక్షణలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు, ముగ్గురు జనరల్ వైద్యులతో శిబిరంలో సేవలందించారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇంటి దగ్గరకే డాక్టర్లు వచ్చారు



నాకు ఒంట్లో బాగోలేదు. ఆస్పత్రికి వెళ్దామని బయలుదేరాను. ఇంతలో మా ఇంటి దగ్గర స్కూల్లోనే ప్రభుత్వం వారు జగనన్న ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు మా వలంటీర్ వచ్చి చెప్పారు. వెంటనే నేను అక్కడికి వెళ్లాను. అక్కడ డాక్టర్ నాకు వైద్య పరీక్షలు చేశారు. మందులు కూడా ఇచ్చారు. ఉచితంగా నాకు వైద్యం, మందులు సమకూరాయి. మాలాంటి పేదవాళ్లకు ముఖ్యమంత్రి జగన్ దయ వల్ల వైద్యం అందింది.

–ఇంటి చిన్నమ్మలు, దుర్గాకాలనీ, చోడవరం

ఉచితంగా మందులిచ్చారు



గ్రామంలో జరిగిన వైద్యశిబిరానికి వెళ్లాను. నాకు కాళ్ల నొప్పులు, జలుబు, తలనొప్పి ఉందని చెప్పాను. డాక్టర్లు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. గతంలో జరిగినపుడు ఇలాగే పరీక్షలు చేసి మందులిచ్చారు. బాగానే పనిచేశాయి.

–సిరిసాల చినమ్మలు, దొండపూడి, రావికమతం మండలం

నాకు కళ్లు సరిగ్గా కనిపించడంలేదు



మా వీధిలో ఆరోగ్య సురక్ష శిబిరం పెట్టారు. అక్కడ డాక్టర్ నాకు కంటి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు పెట్టుకోవాలని చెప్పారు. కళ్లద్దాలు కూడా ఇచ్చారు. డబ్బులు పెట్టి చూపించుకోవాలంటే చాలా డబ్బులయ్యేవి. నాకు అంత స్థోమత లేదు. కూలి పని చేసుకొని బతుకుతున్నాను. జగన్ బాబు దయవల్ల నాకు కంటి వైద్యం జరిగింది.

–సిమ్మ అబద్ధం, యడ్లవీధి చెరువుగట్టు, చోడవరం

'పది' విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

- కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి పాఠశాలల ఆకస్మిక సందర్శన

8లో

వైఎస్సార్‌సీపీకి కొత్త సమన్వయకర్తలు

- పాయకరావుపేటకు కంబాల
- అనకాపల్లికి మలసాల



కంబాల జోగులు



మలసాల భరత్‌కుమార్

నక్కపల్లి/కశింకోట: జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి కంబాల జోగులు, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి మలసాల భరత్‌కుమార్ సమన్వయకర్తలుగా నియమితులయ్యారు. ప్రస్తుతం కంబాల జోగులు విజయనగరం జిల్లా (పూర్వ శ్రీకాకుళం జిల్లా) రాజాం శాసనసభ్యుడిగా ఉన్నారు. జోగులు మొదట 2004లో టీడీపీ నుంచి పాలకొండ ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2012లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో రాజాం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన పాయకరావుపేటకు ఆయనను సమన్వయకర్తగా నియమించారు.

విద్యావంతుడు.. పారిశ్రామికవేత్త

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మలసాల భరత్‌కుమార్ కశింకోట మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామానికి చెందిన వారు. బీటెక్, ఎంబీఏ చదివారు. అమెరికా, కెనడాలలో గ్లోబెల్ ఎక్స్‌పీ సొల్యూషన్స్ పరిశ్రమను నడుపుతున్నారు. దాని బ్రాంచ్ హైదరాబాద్‌లో కూడా ఉంది. భరత్‌కుమార్ రాజకీయ కుటుంబానికి చెందినవారు. ఆయన తల్లి మలసాల కాసులమ్మ (ధనమ్మ) మండల పరిషత్ అధ్యక్షురాలిగా, మూడు దఫాలు జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొందారు. తండ్రి మలసాల రమణారావు విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా ఉన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్‌కు కేంద్రం పచ్చజెండా

- నక్కపల్లి వద్ద 2 వేల ఎకరాల భూమి కేటాయింపు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం
- పరిశ్రమ అంచనా వ్యయం రూ.2,190 కోట్లు
- 10 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి



బల్క్ డ్రగ్ పార్క్ కోసం ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం కేటాయించిన భూములు

నక్కపల్లి: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన నక్కపల్లి క్లస్టర్‌లో మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఇక్కడ బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమమయింది. వివిధ రకాల మందులకు సంబంధించిన రా మెటీరియల్‌ను ఇక్కడ తయారు చేస్తారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా స్కిల్, అన్‌స్కిల్డ్ లేబర్‌తోపాటు, కెమికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ, ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి దొరకనుంది.

కేబినెట్ తీర్మానానికి కేంద్రం ఆమోదం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వ భూములు మాత్రమే సేకరించాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. జిల్లాలోని నక్కపల్లి మండలంలో పదేళ్ల క్రితం ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్ఈజెడ్) కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా స్థలాన్ని సేకరించిన విషయం తెలిసిందే. వేంపాడు, రాజయ్యపేట, చందనాడ, అమలాపురం, డీఎల్ పురం, బుచ్చిరాజుపేట గ్రామాల్లో ప్రభుత్వం సేకరించిన 5 వేల ఎకరాల భూములు ఖాళీగానే ఉన్నాయి. రైతుల నుంచి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఆ భూములకు నష్ట పరిహారం, ప్యాకేజీ తదితర చెల్లింపుల ప్రక్రియ ప్రభుత్వం పూర్తిచేసింది. దీంతో ఈ భూముల్లో రెండు వేల ఎకరాలను బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేటాయిస్తూ ఏపీ కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. దీనిపై తాజాగా కేంద్రం ఆమోదం తెలిపింది.

పారిశ్రామిక ఖిల్లాగా 'పేట'

ఈ పరిశ్రమ ఏర్పాటయితే దాదాపు 10 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే పాయకరావుపేట నియోజకవర్గంలో హెటిరో, డక్కన్ కంపెనీలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ రెండు పరిశ్రమల ద్వారా సుమారు 20 వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే అచ్యుతాపురంలో బల్క్ డ్రగ్ యూనిట్లు ఉన్నాయి. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నక్కపల్లి మండలంలో మరో 5 వరకు(హెటిరో, దక్కన్, లారస్, రెడ్డీస్, దివీస్) వంటి కంపెనీల ఆధ్వర్యంలో బల్క్ డ్రగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నట్లు సమాచారం. తాజాగా కేంద్రం ఆమోదం తెలిపిన మేరకు బల్క్ డ్రగ్ పరిశ్రమ పూర్తయితే పాయకరావుపేట నియోజకవర్గం పారిశ్రామిక ఖిల్లాగా మారనుంది.

మౌలిక వసతులకు సన్నాహాలు

జాతీయ రహదారి నుంచి ఎస్ఈజెడ్ వరకు 80 అడుగుల రోడ్డు నిర్మించేందుకు అవసరమైన భూసేకరణ జరుగుతోంది. కాగిత టోల్‌గేట్ సమీపం నుంచి తమ్మయ్యపేట, పాటిమీద గ్రామం మీదుగా రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసింది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన 60 ఎకరాల భూమిని సేకరించే పనిలో ఏపీఐఐసీ యంత్రాంగం ఉంది. రైతుల నుంచి సేకరించే భూములకు అధిక నష్టపరిహారం డిమాండ్ చేస్తే, ఏపీఐఐసీపై భారం పడకుండా ఇప్పటికే ప్రభుత్వం సేకరించిన భూములతోపాటు, ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల మీదుగా ఈ 80 అడుగుల రోడ్డు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. రోడ్లు, విద్యుత్ సబ్ స్టేషన్లు, డ్రెయినేజీలు తదితర మౌలిక సదుపాయల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎం బూడికి శుభాకాంక్షలు



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు శుభాకాంక్షలు చెబుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

దేవరాపల్లి: జిల్లా వ్యాప్తంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం రోజున అందుబాటులో లేకపోవడంతో పలువురు తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, అనకాపల్లి, మాడుగుల ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ, ఏఈలు, దేవరాపల్లి తహసీల్దార్ ఎం. లక్ష్మి, వీఆర్వోల సంఘం నాయకుడు పోతల శంకరరావు, వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్, ఎంఈవోలు బి.పడాల్ దాస్, వి. ఉషారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఆర్కిటెక్చర్ పోటీల్లో శివాని ప్రతిభ



విద్యార్థిని శివానిని అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఆర్డీవో జయరాం

నర్సీపట్నం : ఆర్కిటెక్చర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయి శివానిని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, ఆర్డీవో హెచ్.వి.జయరాం అభినందించారు. భారతీయ విద్యా మండలి, ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విజయవాడ వారు సంయుక్తంగా డిసెంబర్ 30న విజయవాడలో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న శివాని రూపొందించిన ఇస్రో భారతీయ అభివృద్ధి మైలురాయి అనే చిత్రం రాష్ట్ర స్థాయిలో ఐదో స్థానం దక్కించుకుంది. విద్యార్థినితో పాటు ఆమెను ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు రాజ్‌గోపాల్‌ను ఎమ్మెల్యే, ఆర్డీవో అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దన్నిన నానాజీ పాల్గొన్నారు.

పల్లెవించిన ప్రగతి

దేశానికి పట్టుగొమ్మలు పల్లెలు.. వాటి అభివృద్ధితోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని వైఎస్సార్‌సీపీ పాలనలో నిరూపితమైంది. ఒకనాడు సరైన రహదారి సౌకర్యం లేక తుప్పలు, డొంకల మధ్య మట్టి రోడ్లే గతి. నేడు సర్రున దూసుకుపోయే తారురోడ్లు.. వేసవి వచ్చిందంటే గుక్కెడు నీటి కోసం బిందెలు పట్టుకుని పొలాల్లోని బావుల వద్దకు పరుగుతీసే రోజులు పోయి, ఇప్పుడు ఇంటింటికీ కుళాయి నీరందుతోంది. ఇలా ఒకటేమిటి అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన అతి చిన్న పంచాయతీ చెట్టుపల్లి ఆదర్శంగా నిలుస్తోంది.

ఇది కదా అభివృద్ధి



ఇటీవల తవ్విన సాగునీటి కాలువ

- గ్రామానికి మూడు వైపులా రూ.3.40 కోట్లతో తారురోడ్లు
- రూ.46 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు
- రూ.12 లక్షలతో సీసీడ్రైనేజీల నిర్మాణం
- రూ.8 లక్షలతో మర్రి చెరువు అలుగు నిర్మాణం
- ఆదర్శంగా చెట్టుపల్లి పంచాయతీ
- టీడీపీ మద్దతు సర్పంచ్‌పై వివక్ష చూపని ప్రభుత్వం

చీడికాడ: మండలంలోని వెయ్యి జనాభా, 631 ఓట్లు, 8 వార్డులు కలిగిన అతి చిన్న పంచాయతీ చెట్టుపల్లికి ఐదేళ్ల క్రితం వరకు సరైన రహదారి సౌకర్యం లేదు. సాయంత్రం 5 గంటలు దాటితే ఆ గ్రామానికి వెళ్లలేని పరిస్థితి ఉండేది. ప్రభుత్వాలు మారుతున్నా గ్రామ తలరాత మారలేదు. ఈ నేపథ్యంలో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ గ్రామ రూపురేఖలే మారిపోయాయి. ప్రస్తుత గ్రామ సర్పంచ్ టీడీపీ మద్దతుదారు అయినప్పటికీ ఎటువంటి వివక్ష చూపకుండా నాలుగున్నరేళ్లలోనే అభివృద్ధి చేసింది.

గ్రామంలో అభివృద్ధి ఇదే..

- అర్జునగిరి నుంచి చెట్టుపల్లికి కిలో మీటరు మేర రూ.90 లక్షలతో తారురోడ్డు నిర్మాణం పూర్తి
- చెరకు కాటా నుంచి చెట్టుపల్లికి కిలోమీటరున్నర మేర రూ.1.25 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పూర్తి
- వరహాపురం, పెదగోగాడ రోడ్డు నుంచి చెట్టుపల్లికి కిలోమీటరున్నర మేర రూ.1.25 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం పూర్తి



చెట్టుపల్లి గ్రామం



అర్జునగిరి నుంచి చెట్టుపల్లికి నిర్మించిన నూతన తారురోడ్డు

- ఈ మూడు రోడ్లకు అనుసంధానంగా కిలో మీటరు మేర సీసీరోడ్లు వేశారు.
- రూ.46 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు
- గ్రామంలో 14 మంది నిరుపేదలకు చినగోగాడ వద్ద ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల స్కీమ్ మంజూరు
- రూ.12 లక్షలతో సీసీ డ్రైనేజీల నిర్మాణం పూర్తి
- గ్రామానికి ప్రధాన ఆయకట్టు మర్రి చెరువు అలుగు దెబ్బతింది. మిగులునీరు బయటకు వెళ్లే దారిలేక చెరువు గండికొట్టేది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.8 లక్షలతో అలుగు నిర్మించారు.
- ఏళ్ల తరబడి కలగా మిగిలిపోయిన గ్రామానికి సాగు, తాగునీరు అందించేందుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో విశాఖ డెయిరీ మంజూరు చేసిన రూ.3 కోట్లతో 4ఎల్ సబ్ మైనర్ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు.
- భూ సమస్యలకు చెక్ పెడుతూ సమగ్ర భూ రీసర్వే పూర్తయి 473 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు.
- గత టీడీపీ హయాంలో 120 సామాజిక పింఛన్లు ఉండగా, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో 160కు పెరిగాయి. ఇన్ని రకాల లబ్ధిని పొందిన చెట్టుపల్లి గ్రామం నియోజకవర్గంలోనే మోడల్‌గా అవతరించింది.



మర్రి చెరువు అలుగు

రూ.3 కోట్లతో సాగునీటి కాలువ



వర్షాధారంపైన ఆధారపడి గ్రామంలో పంటలు పండుతాయి. వేసవి వచ్చిందంటే పొలాలు ఎండిపోయి పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. పశువులను మేపలేక తక్కువ ధరకే అమ్ముకునే వారం. ఈ సమస్యను ఏన్నోయేళ్లుగా గత పాలకులకు దృష్టిలో పెట్టినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ పాలనలో 4ఎల్ సబ్ మైనర్ కాలువ పనులు కొంతమేర చేశారు. రానున్న ఖరీఫ్‌కు మా పొలాలకు సాగునీరు అందనుంది.

– పొతాళం శ్రీను, రైతు, చెట్టుపల్లి



గ్రామ రచ్చబండ వద్ద వేసిన సీసీ రోడ్డు

రోడ్లు నిర్మించి మా కష్టాలు తీర్చారు



గ్రామంలో గర్భిణులకు నొప్పులొస్తే ఆస్పత్రికి తీసుకెళ్లడం కష్టమయ్యేది. వర్షాకాలమైతే ఈ సమస్య మరింత జటిలంగా ఉండేది. మా కష్టాలన్నీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టిలో పెట్టడంతో మా గ్రామానికి వచ్చే మూడు రోడ్లను బీటీరోడ్లుగా మార్చి కష్టాలను దూరం చేశారు.

– పొతాళం జయ, గృహిణి, చెట్టుపల్లి, చీడికాడ మండలం

సొంతింటి కల నెరవేరింది



మాది ఉమ్మడి కుటుంబం ఒకే ఇంట్లో పది మంది వరకు ఉంటున్నాం. నాకు ఇద్దరు పిల్లలు, మా ఆయన ఆటో డ్రైవర్, నేను గ్రామంలో చిన్న పాన్ షాపు నడుపుతుంటాను. సొంత స్థలం లేకపోవడంతో దరఖాస్తు చేసుకున్నా. నా పేరిట ఇంటి స్థలంతో హౌసింగ్ స్కీమ్ మంజూరు చేశారు. ప్రస్తుతం ఇల్లు నిర్మాణం చివరి దశలో ఉంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి దయతో నాతోపాటు మరో 13 మంది నిరుపేదలకు సొంతింటి కల నెరవేరింది.

– విస్సారపు లక్ష్మి, గృహిణి, చెట్టుపల్లి

'పది' విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

- పాఠశాలల్లో కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ఆకస్మిక సందర్శన

నర్సీపట్నం: పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆల్ ది బెస్ట్ చెప్పారు. వేములపూడిలో పీబీఎం జెడ్పీహెచ్ స్కూల్, కేజీబీవీ, మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వం సరఫరా చేసిన డిజిటల్ బోర్డులు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయని ఆరా తీశారు. పాఠ్యాంశాల వీడియోలను డిజిటల్ బోర్డుల్లో ప్లే చేసి వివరించడంతో సులభంగా అర్థమవుతుందని విద్యార్థులు బదులిచ్చారు.

ట్యాబ్‌లు ఇచ్చారా అని ఎనిమిదో తరగతి విద్యార్థులను ప్రశ్నించారు. మండలంలో అన్ని పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేశామని, సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తున్నామని ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర వివరించారు. కేజీబీవీలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. స్కూళ్ల నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయం, రైతు భరోసా భవనాలను పరిశీలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

మౌలిక వసతులపై ఎస్టిమేట్ పంపించాలి

బీసీ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి పరిశీలించారు. ఇక్కడ సమస్యలపై ఆరా తీశారు. రన్నింగ్ వాటర్, బాత్ రూమ్స్ డోర్స్ లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కె. రాజేశ్వరి వాపోయారు. 16 గదులకుగాను రెండింట్లో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయని వార్డెన్ లక్ష్మి తెలియజేశారు. అత్యవసర మౌలిక సదుపాయాలకు ఎస్టిమేట్ తయారు చేసి పంపించాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నలుగురి అరెస్టు

కోటవురట్ల: అట్రాసిటీ కేసులో తాళ్లపాలెంలో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపారు. ఈ నెల 31న అర్ధరాత్రి ఇక్కడ పాస్టర్ పొన్నాడ యాకబ్‌పై దాడి చేసి, కులం పేరిట దూషించారనే అభియోగంపై మంతెన దుర్గా నాగఈశ్వర్, చిన్ని మధుమోహన్‌సాయి, పెయ్యిల గణేష్, కలం ఏసులను అరెస్టు చేశామన్నారు. వారిని అనకాపల్లి కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు.

మృతదేహం లభ్యం

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కె. వల్లాపురం గ్రామానికి చెందిన మట్టా రాజులమ్మ (72) మృతదేహం మంగళవారం తాచేరు నదిలో లభ్యమైంది. ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె గత నెల 27వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. చివరకు ముకుందపురం సమీపంలో తాచేర లో ఆమె మృతదేహం లభ్యమైంది. మాడుగుల అగ్నిమాపక అధికారి వి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది శవాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నాయుడు ఫిర్యాదు మేరకు అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ.6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్‌వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్‌వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) అదే సందర్భంలో ఈ సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పోష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జీవిడబ్ల్యువి & వీఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్ట్‌మెంటు కూడా అందరు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐఎన్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6% 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తించుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమించకపోయినచో యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్, అనకాపల్లి జిల్లా.

జనసేన పార్టీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక

మునగపాక: మండలంలోని ఉమ్మలాడకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీకి చెందిన గుడివాడ వెంకటరావు, గుడివాడ లక్ష్మీనారాయణ(బుజ్జి), గుడివాడ మహేష్ చేరిన వారిలో ఉన్నారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పంపాన గణపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ (ఎస్ఆర్), యువజన విభాగం మండలాధ్యక్షుడు మొల్లేటి వినోద్, దళిత విభాగం మండలాధ్యక్షుడు మందా రాము, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఉమ్మలాడ జనసేన కార్యకర్తలు

ఇసుక తరలింపుపై ఇరువర్గాల వాగ్వాదం

దేవరాపల్లి : తెనుగుపూడిలో ఇసుక తరలింపు విషయంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య మంగళవారం వివాదం చోటు చేసుకుంది. స్థానిక శారదానదిలో అధికారులు జారీ చేసిన టోకెన్‌ల ద్వారా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా, టీడీపీ వర్గీయులు అడ్డుకోవడంతో వివాదం రేగింది. ఒకే టోకెన్‌పై ఎక్కువ సార్లు ఇసుక తరలిస్తున్నారని మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు సహా ఇతర టీడీపీ వర్గీయులు ఆరోపించి ఇసుక తరలింపును అడ్డుకున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం అధికారులు జారీ చేసిన టోకెన్ మేరకు ఇసుక తరలిస్తే ఎలా అడ్డుకుంటారని స్థానిక ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు తదితర వైఎస్సార్‌సీపీ వర్గీయులు వారిని నిలదీశారు. దీంతో ఒకరిపై మరొకరు వాదోపవాదనలు చేసుకున్నారు. ఇది కాస్తా తోపులాటకు దారి తీసింది. దీనిపై సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న ఎస్ఐ డి.నాగేంద్ర ఇరువురిని సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇసుక తరలింపును అడ్డుకోవాలనే దురుద్దేశ్యంతోనే టీడీపీ వర్గీయులు రాద్ధాంతం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ వర్గీయులు స్పష్టం చేశారు. దీనిపై ఎస్ఐ డి.నాగేంద్రను వివరణ కోరగా రెండు ట్రాక్టర్లను, పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకొని తహసీల్దార్‌కు అప్పగించామని, ఈ ఘటనపై ఎవరి నుంచి తమకు ఫిర్యాదులు అందలేదని అన్నారు.



తెనుగుపూడిలో ఇసుక తరలింపుపై తోపులాటకు దిగిన ఇరువర్గాలు

వంజంగి హిల్స్‌లో పారిశుధ్య పనులు వేగవంతం

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతంగా విశ్వవ్యాప్తి పొందిన వంజంగి హిల్స్‌లో పారిశుధ్య పనులు ప్రారంభమయ్యాయి. రెండు నెలల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వంజంగి పరిసరాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ నెల 9వ తేదీ వరకు వంజంగి హిల్స్ మూసివేసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఉదయం నుంచి డీఎల్పీవో పీఎస్ కుమార్, ఎంపీడీవో సాయినవీన్ పర్యవేక్షణలో లగిశపల్లి నుంచి రోడ్డుకు ఇరువైపులా చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చేపట్టారు. బుధవారం నుంచి పారిశుధ్య పనులు వేగవంతం చేస్తామన్నారు.



వంజంగి హిల్స్‌లో పారిశుధ్య పనులపై సమీక్షిస్తున్న డీఎల్పీవో కుమార్,ఎంపీడీవో సాయినవీన్

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షునికి గాయాలు

నక్కపల్లి : జాతీయ రహదారిపై అడ్డురోడ్డు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. నక్కపల్లి నుంచి అడ్డురోడ్డులో తన స్వగృహానికి బైక్‌పై వెళ్తుండగా పెట్రోలు బంకు దాటిన తర్వాత కుక్క అడ్డుగా రావడంతో రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. రక్తస్రావం అయింది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పార్టీ నాయకులు గొర్ల బాబూరావు, తాతారావు, చంద్రరావు తదితరులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని అడ్డురోడ్డులో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్స్‌లో అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దగ్గరుండి స్వయంగా నర్సింహమూర్తికి మెరుగైన వైద్య సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.



గాయపడ్డ శీరం నర్సింహమూర్తి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మి సారె ఊరేగింపు నేడు



కశింకోటలో మార్గశిర గురువార ఉత్సవానికి ఏర్పాట్లు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన కనక మహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు బుధ వారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిం చనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్ మంగళవారం తెలిపారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మహిళలు తయారు చేసిన స్వీట్లు, పండ్లు వగైరా అమ్మ వారికి నివేదించి గ్రామ వీధుల్లో ఊరేగింపు జరగనుందన్నారు. నాలుగవ మార్గశిర గురు వారం పురస్కరించుకుని భక్తులు, ప్రముఖుల భారీ సంఖ్యలో హాజరుకానుండటంతో, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజు మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరగనుందన్నారు.

వామనావతారంలో వేంకటేశుడు



కశింకోట: స్థానిక గవరపేటలో ఉన్న వేంకటేశ్వర స్వామి మంగళవారం భక్తులకు వామనావతారంలో దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైన వామనావతారంలో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. తిరుప్పావై పాశుర విన్నపం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

చురుగ్గా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

కశింకోట: కశింకోటలోని అఫీషియల్ కాలనీ, గోవిందరావు కాలనీల్లో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.20 లక్షల నిధులను సమకూర్చారు. వీటితో చేపట్టిన పనులను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం పరిశీలించారు. పనుల్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 13,947 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,510	4,810
మొదటి రకం	3,950	4,500
రెండో రకం	3,750	4,250
మూడోరకం	3,440	3,730

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	రాజా
పిండం (మధ్యాహ్నం, రెండో ఆట)	
వెంకీ (ప్రూర్నింగ్, సాయంత్రం ఆట)	సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	షిర్డిసాయి
సలార్	పర్తిసాయి
మంగళవారం	వెంకటేశ్వర
తికమక తాండ	శ్రీసత్య
సలార్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-29 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రగతి పథంలో..



అనకాపల్లి పట్టణం

అనకాపల్లి పట్టణం జిల్లా ప్రధాన కేంద్రంగా నూతన శోభను సంతరించుకుంటోంది. ఏ దిక్కున చూసిన అధునాతన లైటింగ్, పార్కింగ్, పచ్చదనంతో కళకళలాడే డివైడర్లు, ఆధునికీకరించిన రోడ్లతో ఆహ్లాదంగా కనిపిస్తోంది. విశాఖ నగరానికి దీటుగా రోడ్లు పునరుద్ధరణకు నోచుకోవడంతో పట్టణవాసులు, చాన్నాళ్ల తర్వాత పట్టణానికి వస్తున్న స్థానికులు ఆశ్చర్యంతోపాటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తుమ్మపాల: జీవీఎంసీలో అనకాపల్లి అంతర్భాగమై జోన్-7గా ఉన్నప్పటికీ ఒకప్పటి మున్సిపాలిటీ ఛాయలే మొన్నటి వరకు కనిపించేవి. సీఎం జగన్ పాలనలో ప్రత్యేక జిల్లా విభజనతో, జిల్లా కేంద్రంగా మారింది. భారీ స్థాయిలో అభివృద్ధికి నోచుకుంది. దీంతో మున్సిపాలిటీ జాడలు కనుమరుగై, నగరాన్ని తలపించేలా ఆధునిక వసతుల్ని అందుకుంటోంది.

రోడ్ల అభివృద్ధితో తొలగిన ట్రాఫిక్ ఇక్కట్లు

జాతీయ, అంతర్రాష్ట్ర వాహనాలు పట్టణంలోకి రాకుండా హైవే ద్వారా పట్టణానికి 2 కి.మీ. దూరంలోనే రోడ్లను మళ్లించారు. ఆనందపురం నుంచి (పట్టణంలోకి వచ్చేవి మినహా) ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను శంకరం సమీపంలోని ఏలేరు కాలువ వద్ద హైవే మీదుగా మళ్లించారు. అంతవరకు ఉన్న శంకరం రైల్వే వంతెన రోడ్డును విస్తరించి పట్టణంలోకి రాకపోకలు సుగమం చేశారు. గతంలో గుంతలుగా ఉన్న రోడ్డును పూర్తిగా అభివృద్ధి చేసి సుందరీకరణ చేశారు. విశాఖ నుంచి వచ్చే వాహనాలకు కూడా ఇంటర్ చేంజ్ సెక్షన్స్ ద్వారా హైవేకి మళ్లించి పట్టణంలో రాకపోకల్ని క్రమబద్ధీకరించారు. అక్కడ నుంచి పట్టణంలోకి వచ్చే రోడ్డును నాలుగు లైన్లుగా అభివృద్ధి చేశారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలకు కూడా కొత్తూరు, పూడిమడక జంక్షన్ల వద్ద ప్రవేశాలు కల్పించారు. దీంతో పట్టణానికి ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగిపోయింది.

ఫ్లాగ్ మాస్ట్ పోల్‌తో స్వాగత ద్వారం

అనకాపల్లి పట్టణంలోకి ప్రధాన ప్రవేశద్వారం ఉన్న జాతీయ రహదారి ఇంటర్‌చేంజ్ సెక్షన్ వద్ద ఫ్లాగ్ మాస్ట్ పోల్(జాతీయ జెండా)తో పట్టణానికి స్వాగత ద్వారాన్ని ఎన్టీపీసీ సహకారంతో ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అనకాపల్లిలో ప్రవేశాన్ని ఆహ్లాదకరంగా మార్చి, పచ్చని మొక్కలు, డివైడర్లు, ఇంటర్ చేంజ్ రోడ్లతో రింగులు తిరుగుతూ స్వాగతం పలుకుతోంది. పట్టణానికి ప్రధాన ముఖద్వారంగా, నిత్యం రద్దీగా ఉండే సుంకరమెట్ట, శంకరం రోడ్లు ఇపుడు పట్టణానికి రాకపోకలు సాగించేవారికి వీలుగా మార్గం సుగమం చేశారు.

దీంతో అనకాపల్లి పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అనకాపల్లిలోకి ప్రవేశించే సుంకరమెట్ట రోడ్డు



కొత్తగా వేసిన అనకాపల్లి-సబ్బవరం రోడ్డు





పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ధగధగలు

జర్నీ టైం తగ్గింది



నేను ఫార్మాసిటీలో పనిచేస్తున్నాను. రోజూ ద్విచక్ర వాహనంపై రాకపోకలు చేస్తుంటాను. గతంలో పట్టణం దాటాలంటే ట్రాఫిక్ రద్దీ ఉండేది. ఇటీవల పట్టణంలోని రోడ్ల ఆధునికీకరణతో పాటు సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారి ఇంటర్ చేంజ్ సెక్షన్ వరకు రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. పట్టణంలో నుంచి నిమిషాల్లో నేరుగా హైవేకు చేరుకోగలుగుతున్నాం.

– దాసరి గోపాలరావు, గాంధీనగరం

ట్రాఫిక్ సమస్య తీరింది



మా గ్రామం నుంచి పట్టణంలోకి వెళ్లి అక్కడ నుంచి మునగపాక వెళ్లేవాడిని. చాలా సమయం పట్టేది. అనకాపల్లి–ఆనందపురం ఆరు లైన్ల హైవే విస్తరణతో శంకరం నుంచి నేరుగా పూడిమడక బైపాస్ జంక్షన్‌కు సులభంగా చేరుకుంటున్నాను. దూరం తగ్గింది. పట్టణం నుంచి వెళ్లేటపుడు దూరంతో పాటు ట్రాఫిక్ సమస్య ఉండేది. ఇప్పుడు ఎటువంటి ట్రాఫిక్ సమస్య లేదు.

– అక్కిరెడ్డి శ్రీను, అక్కిరెడ్డివానిపాలెం

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

అనకాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 82వ వార్డు సచివాలయం-1 పరిధి అంజయ్యకాలనీలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు జరిపి, మందుల్ని ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లి: జీవీఎంసీ 82వ వార్డు సచివాలయం-14 పరిధి పూడిమడక రహదారిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, కార్పొరేటర్ మందపాటి సునీత హాజరవుతారన్నారు. సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



తీడలో క్రికెట్ ఆడుతున్న యువకులు

కశింకోట: మండలంలోని తీడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. తీడ నుంచి రెండు జట్లు, చెరకాం నుంచి ఒక జట్టు పోటీలో పాల్గొన్నారు. కన్నూరుపాలెం పీడీ జి.వీరునాయుడు పోటీలను పర్యవేక్షించారు. బుధవారం కన్నూరుపాలెం హైస్కూల్లో కబడ్డీ, తీడలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

మళ్లీ.. మురి'పింఛన్'

వృద్ధులకు, అభాగ్యులకు ఆసరాగా నిలిచే సామాజిక పింఛన్లలో సరికొత్త అధ్యాయానికి నేటి నుంచి శ్రీకారం చుట్టనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన పింఛన్ల పెంపు హామీ మేరకు రూ.3 వేల చొప్పున పింఛన్ల పంపిణీకి అధికారులు సన్నద్ధమయ్యారు. బుధవారం నుంచి ఊరూవాడా పండగలా పింఛన్ల పంపిణీ జరగనుంది.

- నేటి నుంచి పెంచిన పింఛన్ల పంపిణీ

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల బంగార్రాజు కల్యాణమండపం సమీపంలో వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు, డయాలసిస్, హెచ్ఐవీ రోగులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ వరకూ రూ.2,750గా ఉన్న పింఛన్‌ను జనవరి నుంచి రూ.3 వేలుకు పెంచి, అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పింఛన్‌దారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

జోన్‌లో 5న పెంచిన పింఛన్ల పంపిణీ

అనకాపల్లి పట్టణం జీవీఎంసీ జోన్ పరిధిలో రూ.3 వేలకు పెంచిన వృద్ధాప్య, వితంతు తదితర పింఛన్ల పంపిణీ ఈ నెల 5న జోనల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు జెడ్సీ సుర వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, జోన్ పరిధి కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఉపమాక వెంకన్న తిరువీధి సేవ



రాజాధిరాజ వాహనంపై స్వామివారు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉపమాక వేంకటేశ్వర స్వామి రాజాధి రాజ వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకాలు అర్చనలు నిర్వహించారు. రాజాధి రాజవాహనంలో స్వామివారిని, పల్లకిలో గోదాదేవి అమ్మవారిని ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై వ్రతంలో భాగంగా 18వ పాశురం ఉన్దు మదగలిత్త నోడాద తోళ్లలయన్ విన్నపం చేశారు. అనంతరం తీర్థ గోష్ఠి ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం నిత్య కార్యక్రమాలు యథావిధిగా నిర్వహించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య, భారత విద్యార్థి ఫెడరేషన్ సంఘాల క్యాలెండర్‌ను ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల కోసం పోరాడే డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. గీత కృష్ణ, ఎం.రమణ పాల్గొన్నారు.

- ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన లచ్చన్నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి, నానాజీ, సుభాషిణీ దేవి, మహిమారావు, ఎం.సూర్యలక్ష్మి, కె.మురళి, జాషువా, సలీం పాల్గొన్నారు.

పడమటమ్మకు బోనాల సమర్పణ

కశింకోట: మండలంలోని విసన్నపేటలో వెలసిన పడమటమ్మను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అరబుపాలెంలో గ్రామసభ

మునగపాక : అరబుపాలెం గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. గ్రామ సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ



బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కరపత్రాన్ని చూపుతున్న వెంకటపతిపాలెం మహిళలు

పరవాడ: అయోధ్యలో ఈ నెల 22న బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను నాయుడుపాలెంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఫొటో, అక్షింతలు, ఆహ్వాన పత్రాన్ని భక్తులకు అందించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మనం సిద్ధం చేసిన అక్షింతల్లో కలపడం ద్వారా సిద్ధం చేసిన అక్షింతలు పవిత్రం అవుతాయన్నారు. అక్షింతలను ఇంట్లో అందరు వేసుకోవాలని భక్తులకు సూచించారు.

7న విశాఖలో బీసీ చైతన్య సభ



చైతన్య సభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కర్రి రామకృష్ణ

అనకాపల్లి: ఈ నెల 7న విశాఖలోని ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కళాశాల క్రీడా మైదానంలో బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ తెలిపారు. స్థానిక ఉడ్‌పేట బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం చైతన్య సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు పడుతున్న ఇబ్బందుల్ని ఆలోచించి 18 రకాల చేతివృత్తులకు మొదటి విడతగా రూ.1300 కోట్లు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. చేతివృత్తులకు, బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖలో జరిగే బీసీ సభకు జిల్లాలోని బీసీ సోదరులంతా హాజరుకావాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, రాష్ట్ర నాయకుడు అలమండ శ్రీను, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఓరిగంటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



కంటి ఆపరేషన్ చేయించుకున్న రోగులతో వైద్య సిబ్బంది

తుమ్మపాల: కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ కె.మల్లేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఏఎంఏఎం రోటరీ కంటి ఆస్పత్రిలో 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఏడుగురికి ఐవోఎల్ ఆపరేషన్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కోలుకున్నాక, వారం రోజులకు సరిపడా మందులు అందించి, వారిని ఇళ్లకు చేరవేసినట్లు డాక్టర్ పి.దేవి తెలిపారు.

మంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షల వెల్లువ



మంత్రి అమర్‌నాథ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు

కశింకోట: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మండలానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మిందిలోని మంత్రి నివాసంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తదితరులు కలిసి, పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

వాడ్రాపల్లిలో షటిల్ పోటీలు



వాడ్రాపల్లిలో మహిళల షటిల్ పోటీలు

మునగపాక : ఆడుదాం ఆంధ్రాలో భాగంగా పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు.వాడ్రాపల్లి సచివాలయ పరిధిలో షటిల్ పోటీలను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. క్రీడలను తిలకించేందుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు.

తాళ్లపాలెంలో పశు వైద్య శిబిరం



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పాల ఉత్పత్తిదారుల సంఘం వద్ద మంగళవారం విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎదకు వచ్చిన వాటికి గర్భధారణ ఇంజక్షన్లు వేశారు. ఈ సందర్భంగా డెయిరీ డైరెక్టర్, యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ పాడి పశువులకు నూకల జావ పెట్టవద్దని, పచ్చగడ్డి పెరుగుదలకు యూరియా వేసిన 20 రోజుల తర్వాత మాత్రమే కోసి, పశువులకు మేతగా వినియోగించాలన్నారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, పశువైద్య సూపర్‌వైజర్ సత్యనారాయణ, సిబ్బంది, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, వేతన కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ సామాజిక చైతన్య సభకు ఆహ్వానం



బాలకృష్ణకు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న ఓబీసీ మోర్చా ప్రతినిధులు

అనకాపల్లి: జిల్లా కార్మిక శాఖ కమిషనర్ బాలకృష్ణను ఆయన కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 7న జరిగే బీసీ సామాజిక చైతన్య సభకు ఆహ్వాన పత్రం అందించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్రి రామకృష్ణ, సభ్యుడు కొండబాబు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.